# పుడిసెడు నీళ్లు

నడి వేసవి.

చైత్ర వైశాఖ మాసాలు పోటీపడి ఎండలు పెరుగుతున్నాయి. కన్ను తెరిస్తే నిప్పచ్చరమైన ఎడారిలాంటి బయలు. ఎక్కడ చూసినా తల దాచుకునేందుకు చెట్టు, గొంతు తడుపుకునేందుకు నీళ్ళు లేవు. అప్పటికే గంటనుండి ఏకధాటిగా నడుస్తున్నాడు పురుషోత్తం. మరో అరగంట నడిస్తే కానీ గమ్యం చేరుకోలేడు.

గొంతు క్షణ క్షణానికి తడారిపోతోంది. ఊరు చేరుకునేలోగానే ఊపిరి ఆగిపోతుందా? ఇంత ఆశపడి వచ్చి చివరికి యిక్కడ దిక్కుమాలిన చావు చస్తానా? హు నిట్టూర్చాడు పురుషోత్తం. తనకి దిక్కెవరున్నారు. అంతా విడిపోయారు. సిరితోపాటు వచ్చి, మగసిరితో పెరిగి చివరికి ఆ శ్రీ పోగానే అంతా మెల్లి మెల్లిగా తప్పుకున్నారు. ఒంటరివాడ్ని ఓడినవాడ్ని చేసి వెళ్ళిపోయారు. బ్రతుకుమీద ఆశని చంపుకోలేక బలవంతంగా ప్రాణాలు తీసుకోలేక రోజులు సాగదీస్తున్నాడు.

తన పరిచయ ప్రపంచం చాలా పెద్దది. తనతో కలిసి చదువుకున్న వాళ్ళు, మెలిసి తిరిగినవాళ్ళు, చేబదుళ్ళు మొదలు వేసాయం వరకు పొందినవాళ్ళు బంధువులు మిత్రులు చాలామందే వున్నారు. వెళ్ళినా చాలానాళ్ళు గడిచిపోతాయి. ఎందుకొచ్చావని అడక్కుండా వచ్చిందే అపూర్వమని ఆదరించే వాళ్ళు బోలెడున్నారు.

అలా వెళ్ళి 'అమరావతి' ఎక్కి వస్తోంటే తన వూరి 'కరణం' కన్పించారు. ఆయన్ని పలకరించడానికి ముఖం చెల్లక తల తిప్పుకున్నాడు. అయినా ఆయనే పలకరించాడు. బహుశా ఆయనకి తను తన వారివల్ల 'వెలి' వేయబడిన విషయం తెలిసుండదు. అందుకే 'ఒరేయ్ పురుషోత్తం! నీకీ విషయం తెలియదా! మీ దాయాది పోయాడు. మీ పంపకాలు పీడపోయింది. ఊరి ముందరి అరెకరం అమ్మేసుకోవచ్చు అడిగేవాడు, అడ్డేవాడు లేడు. అసలది మీదే! అనవసరంగా పేచీకి దిగాడు ఆ ముసలాడు నువ్వురా! నేను దగ్గరుండి అమ్మిస్తా!" అన్నాడు.

తనకి ప్రాణం లేచొచ్చింది అరెకరం అంటే ఎంత హీననుకున్నా తిరిగి తనని సిరి వరిస్తుందా! తనకీ మంచిరోజులొస్తున్నాయా! నిట్టూర్చాడు. కరణంతో వస్తున్నానని చెప్పాడు.

అదిగో ఆ మాటే యీ బాట వెంట నడవడం!.

తనెన్నడయినా నడిచి వెళ్ళాడా? ఏమో! ఆ రోజులు గుర్తులేవు. - పాతికేళ్ళు వచ్చేసరికి పెత్తనం పెళ్ళాం - కారు అధికారం వచ్చాయి. తను మెట్టు దిగితే కార్లో కాలు పెట్టేవాడు! కారు దిగితే అటు ఆఫీసో! ఇటు యిల్లో - బిజినెస్ మీద ఎక్కడికి వెళ్ళినా కారో - ట్రెయినో - ప్లేనో అలా నడిచింది యోగం! అవును యోగమే! అభియోగం వచ్చి పడేదాకా జర జరపాకే గొడ్డుజెర్రిలా సాగింది భాగ్యయోగం.

అలాటిది ఏమైంది? కరమింగిన వెలగపండు అయింది. ఎంతగా వెలిగిందో అంతలా కర్పూరంలా హరించుకుపోయింది. తన ఆస్తి తన చేతులు దాటిందే కాని అదెక్కడికీ వెళ్ళలేదు. భార్యాబిడ్డల కైవసం అయింది. తనని ఖాళీ చేతుల్తో బయటికి నడిపించారు. ఔను! తన కర్తకాడు! హర్తకాడు! భోక్తాకాడు! సంరక్షకుడు అంతే! ఇంట్లో ఎలా అడుగు పెట్టాడో అలాగే బయటికి నడిచాడు.

ఈ నేలలో పుట్టుకతో పాటే గాలిలో కలిసి మనిషిలో ప్రవేశిస్తుంది వేదాంతం! అందుకే యీ లోకంలోకి ఒంటరిగా వచ్చాం ఒంటరిగా వెళ్తాం! ఆలు బిడ్డలు, ఆప్తులు, అన్నదమ్ములు ఎవరూ వెంట నంటిరారు! ఇదీ తనకు వర్తించింది అందుకే.

గుప్పెడు ప్రాణం నిలవడానికి ఎంత కావాలి?

ఎంతో అక్కర్లేదు. కానీ యిప్పుడు యీ క్షణాన గుక్కెడు నీళ్ళు కావాలి! కానీ ఎక్కడున్నాయి అవి!

చుట్టూ చూశాడు పురుషోత్తం! ఎక్కడా కలికానికయినా లేవు. గొంతు తడార్చుకపోతోంది. ఎండమావులు తప్ప మావిడి చెట్లు కూడా ఎక్కడా లేవు. పైన ఎండ మాడ్చేస్తోంది. క్రింద కాళ్ళు మాడిపోతున్నాయి. నాలుక పిడచకట్టుకపోతుంది. చుట్టూ చూసి తనని చూసుకుని నవ్వుకున్నాడు పురుషోత్తం.

గ్లాస్కో మల్లు జుబ్బా, గ్లాస్కో, పంచె, ఖరీదైన చెప్పులు, చేతులకు ఉంగరాలు- ఒకొక వేలికున్న వజ్రం-వైడూర్యం-గోమేధికం-నీలం-నీలం శనికిట! తనకి శనిదశ పట్టిందని ఆ పందొమ్మిదేళ్ళ మహాయోగ కాలంలో ఘట్కాంతరంలోనో మరెప్పుడో శని పాతాళానికి తొక్కినట్టే తొక్కి మళ్ళీ పైకి లాక్కెళ్తాడట. దేశాన్నేలే ఒక మహాజాతకానికి పట్టిన దశే తనకీ పట్టిందట. అందుకని శని శాంత్యర్థం 'నీలం' ధరించమన్నాడు. ఆలోచించే వ్యవధి కానీ ఎదిరించి వాదించే తీరికకానీ లేదు - సరేనన్నాడు - ఏమైంది ఆ 'ఉంగరాల' మహిమ? 'శని' ముందు డీలాపడి పోయాయా ?

'ఎంత మంచి మాట!'

గ్రహచారం! అది మాత్రం!

పైన తిరిగే గ్రహాల చారం బట్టే యీ నేలమీద నరుల చారం వుంటుందట. ఎంత నిజం! ముఖ్యంగా తన జాతకంలో.

చప్పున ఆగేడు ఊహల్లోంచి బయటపడ్డాడు.

రాయి తగిలి వేలు చిట్లి రక్తం చిమ్ముతోంది.....అసంకల్పితంగా వంగి వేడి వేడి దుమ్ము అద్దేడు.... ఇదే ఆ రోజుల్లో అయితే....

సెక్రటరీ బెంబేలు పడేవాడు! ఫోను! మీద ఫోన్! డాక్టరు వెంకటేష్ ఉరుకులు పరుగులతో వచ్చేవాడు. ఇంజక్షన్ యిచ్చేవాడు. కట్టుకట్టేవాడు. నాలుగు రోజులు బెడ్ రెస్ట్ అనేవాడు. ఇల్లాలూ, ఇంట్లోని జనాలు పిల్లలకు పెద్దలూ చుట్టూ చేరేవారు. అడుగుతీసి అడుగు పెట్టనివ్వకుండా అన్నీ ఫోన్లమీద జరిపించేవారు, ప్...

తలెత్తి చూశాడు. ఎక్కడో దూరాన బ్రిడ్జి కనిపిస్తోంది ఇంకో పావుగంట నడిస్తే తప్ప చేరుకోలేడు. అంతదాకా బతికేదెలా? ఎలా ఏమిటి ? ఇన్నేళ్ళూ ఎలాగో అలాగే! నారుపోసినవాడు - నీరు పోయడా? తప్పకుండా? లేకపోతే......

ఏ పూట గోపాళం ఆ పూట గోవిందగా బతికిన తన కుటుంబానికి - తన వల్ల కాదూ ఆ మహాభాగ్యం పట్టింది. తను 'లక్ష్మి'ని కట్టుకోవడంతో-

కట్టుకోవడం ఏమిటి? ఆవిడ ఏమైన పట్టు పంచా? గ్లాస్కో పంచా? గావంచా? భార్యని ఆకట్టుకోవాలే కానీ కట్టుకోవడం ఏమిటో! పిచ్చిగానీ-

తమ అందరి అదృష్టమే మారిపోయింది! పూరింటి నుంచి భవంతికి మారారు! అందరూ జాగ్రత్తపడ్డారు - తనే మేలుకోలేకపోయాడు! చుట్టూ బిగిసిపోతోన్న వాతావరణాన్ని గుర్తించలేకపోయాడు.

ఎవడు చేరేశాడో కానీ లక్ష్మి తనని నమ్మడం మానేసింది. చెక్కులు, నగలు డబ్బు తీసుకోవడం తప్ప - అరిచి గీపెట్టినా అర్ధ రూపాయి యిచ్చేది కాదు. పిచ్చి గానీ ఆ రోజుల్లో తనకి అరవెయ్యో - అర లక్షో అవసరం వచ్చేది. అంతేకానీ అర రూపాయి అవసరం ఏమిటి?

పిల్లలు పెద్దవాళ్ళై లక్ష్మి క్రమ క్రమంగా 'బీగాలు' పుచ్చుకోవడంతో తను యిరకాటాన పడ్డాడు. ఇల్లరికం అల్లుడిగా తన స్థానం ఒక కాపలాదారుగా స్థిరపడింది - దానికి తనేం బాధ పళ్ళేదు. తను 'గార్డియన్' - అది చాలు - అదే పదివేలు అనుకున్నాడు. కానీ పదివేలు మాయం చేసి తనని దొంగని చేసి నిలేసి మాట్లాడ్తారని అనుకోలేదు. అదిగో! అప్పుడూ! తనకి జ్ఞానోదయమైంది....

ఇల్లాల్ని వద్దనుకున్నాడు......

పిల్లల్ని కాదనుకున్నాడు. ఔను రెక్కలొచ్చిన పక్షుల గురించి ఎందుకు బాధపడాలి? ఆ నిశ్చయంతో బయట పడ్డాడు. తిరిగిన చోటు తిరక్కుండా తిరుగుతోన్న తనకు కాలచక్రం మళ్ళీ మంచి కాలాన్ని చూపిస్తోంది.

ఋతు చక్రంలో వసంతం గ్రీష్మం వర్ష శరద్ హిమం శిశిరం పరిభ్రమించినట్లు మానవ జీవితంలో హెచ్చు తగ్గులు పైకి క్రిందికి తిరుగుతూ వుంటాయా! ఉంటాయనడానికి

యిదేకదా ఉదాహరణం.....

తనుది అనే గుర్తే లేదు. దానికంత విలువా అనీ తెలీదు మార్గమధ్యంలో రైల్లో కరణంగారు కలిసేదాకా.... అదే యిలా లాక్కొచ్చింది. అదృష్టం అంటే అంతేకదా - కనిపించనిది....

అదిగో బ్రిడ్జి.... ఆపైకి ఎక్కి దిగి అటు చూస్తే నీళ్ళంటే పుడిసెడు నీళ్ళు తాగితే.... బ్రతికి బట్టకట్టే యోగం వుంటే అక్కడ నీళ్ళుంటాయి - లేదా గొంతెండి....

ఎక్కాడు.... దిగాడు... చూశాడు....

చెలిమిలాంటి చెలిమ.... కానీ ఆకులూ, దుమ్మూ, ధూళీ, పుల్లా పుడకా.... అన్నీ వున్నాయి. తనా నీళ్ళు తాగగలడా! వేడిచేసి చల్చార్చి ఫిల్టర్‌లో దింపిన నీళ్ళు కూడా ప్రమాదమని మినరల్ వాటర్ తాగిన తాను....

నవ్వొచ్చింది పురుషోత్తానికి.....

మా తాతలు నేతులు తాగారు. మా మూతులు వాసన చూడండీ అంటారు. అది కాదే యిది - తనే తాగాడు - మరిప్పుడు - ఆ నీరు తాగటానికి మనస్కరించలేదు. మెల్లిగా పైకెక్కి వచ్చి అటు చూశాడు. అందులో ఎవరో స్వాముల వారట. గుడిసె - ఛ? ఛ! కుటీరం వేసి కూర్చోపెట్టారట ఇప్పుడు దాన్ని అమ్మివేయాలి అతన్ని లేవగొట్టాలి.... వెళతాడా! ఏమో! ఊరిజనం అతనికే మద్దతు ఇస్తారు. తనకి శ్రీరంగనీతులు చెబుతారు - పోనీ ఆ కాస్త వదిలేసి అమ్ముకుంటే - అమ్మో, అయిదు సెంట్లు - ఎంత విలువో -

విలువైన ప్రాణాలు అందాకా నిలవద్దూ?

నిలవకేం చేస్తాయి - తను మొండిఘటం ! అంత సులువుగా చావడు ! బ్రతికే యోగం వుంటే ఎలాగూ బ్రతుకుతాడు. అందుకేగా మరికి 'నీళ్ళు' వద్దని ముందడుగు వేసింది......

కంటికి దగ్గరే కానీ కాలికి ఎంత దూరం.... దూరం.... దూరం..... తనని యిలా దూరతీరాలకు రప్పించిందీ - తన వారికి దూరం చేసిందీ, ఏమిటి? సీతారామారావు గుర్తొచ్చాడు చప్పున - ఔను తను అతన్ని దూరం చేయలేదూ - మామగారితో వంశ పారంపర్యంగా వస్తోంది వాటా వ్యాపారం, వాళ్ళుమమేకంగా బిజినెస్ చేశార్త -

అదొక్కటేనా ? సీతారామారావు చొరవ అదీ నచ్చలేదు-

సీతారామారావు చురుకుదనం! అదీ నచ్చలేదు.

సీతారామారావు చాకచక్యం! అదీ నచ్చలేదు.

అన్నిటికి మించి అర్ధాంగి అతన్ని మెచ్చుకోవడం! అసలు నచ్చలేదు. అందుకే లౌక్యంగా అతన్ని దినదినం పాతేస్తూ వచ్చాడు! చివరికి ఓనాడు చూస్తే - అంతా తనుది. అతంది ఖాళీ - అతనేం అనలేదు తిట్టలేదు కొట్టలేదు. నెమ్మదిగా ఓ చూపు చూసి వెళ్ళాడు.

మరిప్పుడు తలపుల్లోకి వచ్చాడు!

తల విదిల్చాడు పురుషోత్తం....

ఎదురుగా ఊరు ! హమ్మయ్య వచ్చేశాడు. ఇక సర్వం సుఖాంతం. శుభం! ఇలా మనసు గతంలోకి తప్పుకోవడం పూర్వాపరాలు చర్చించుకోవడం వుండదు. దీన్నమ్మి వచ్చాడు - దీన్నమ్మి సుఖపడ్డాడు - సుఖం తర్వాత ముందు గుక్కతిప్పుకోడానికి పుడిసెడు నీళ్ళు కుటీరంలో తాగేస్తే - ఆపై -

లోపలికి నడిచాడు.

"ఎవరు బాబూ?"

పరమ శీతలమైన ప్రశ్న

ఎండన పడి వచ్చిన పురుషోత్తానికి ఎదుటి మనిషి కనిపించలేదు. అందుకే 'మంచినీళ్లు' అని అడిగాడు.

"ఇదిగో బాబూ!" అందించాడు.

ఐస్‌లాంటి ముంత!

ఛీ! తను ముంతలో తాగుతాడా! ఫ్రిజ్ లోంచి, బాటిల్లోంచి, వంచి 'ఏరా' గ్లాసులో యిస్తే - ఛ!

కాలే కడుపుకు గంజే పానకం - ఎండే గొంతుకు నీరే అమృతం అనుకని గటాగటా తాగేశాడు.

తాగేక.

'పోతున్న ప్రాణాల్ని నిలబెట్టారు స్వామీ! మీకు థాంక్స్' అన్నాడు.

అప్పటికి కళ్ళు ఆ చల్లదనానికి అలవాటై ఎదుటి వ్యక్తి కనిపించాడు. అతన్ని అతన్ని చూసి... నివ్వెరపోయి 'నువ్వు - మీరు నువ్వా....' అన్నాడు పురుషోత్తం.

"ఔను-నేనే-పురుషోత్తం! ఫోం సోఫా కనీసం ఫేం కుర్చీ లేదు కానీ దర్భాసనం వుంది కూర్చో - ఏం జరిగిందో చెప్పు"

ఆ ఆదరణకు తబ్బిబ్బై కూలబడ్డాడు పురుషోత్తం.

"అదీ సంగతి సీతారాం! అంత బతుకు బతికి ఆఖరికి దేశ దిమ్మరి అయ్యాను. కరణం చెబితే యీ స్థలాన్ని అమ్ముకుందామని వచ్చా - దారిలో పుడిసెడు నీళ్ళు లేక ఎక్కడ ఎండవడకు చచ్చిపోతానో అని అనుక్షణం యాతనపడ్డా - తీరా యిక్కడికి వస్తే - నువ్వు - చూశావా చిత్రం ! ఎవరి నోటి ముందు కూడూ నీరూ తీసి గూడూ గుడ్డా లేకుండా చేశానో ఆయన ఆశ్రయం యిచ్చి నీరిచ్చి ప్రాణం నిలిపాడు."

నవ్వుతూ-చిదానందయోగిలా వున్నారు సీతారామారావు.

"మరిక వస్తా-"

"ఎక్కడికి పురుషోత్తం ఊర్లోకా?"

"కాదు-అనంతంలోకి-"

"అదేం?"

"ఈ స్థలం అమ్మి, నిన్ను. మళ్ళీ-"

"వెర్రివాడా! నువ్వూ నేనూ నిమిత్త మాత్రులం - కర్మ మనది. కర్తవ్యం మనది. ఫలం దైవాధీనం - నువ్వెవరు ? నేనెవరు ? అంతా కీలుబొమ్మలం. ఆ సర్వేశ్వరుడి లీలాకేళిలో పావులం కూర్చొ - ఎక్కడికి వెళతావ్. గవేషణలో కూలిపోయే దానికంటే - ఆ స్థలం అమ్మి ఆశ్రమాన్ని వృద్ధిపరచు - నీలాంటి ఆర్తులకి మరి కొందరికి ఆశ్రయం కల్పించు - ఇక్కడే వుండు, కృష్ణారామా అంటూ కాలక్షేపం చెయ్-"

పురుషోత్తం జ్ఞానయోగం సిద్ధించిన వాడిలా వుండిపోయాడు కొద్దిసేపు. ఆ తర్వాత అన్నాడు మెల్లిగా.

"సీతారామ చరణం శరణం గచ్ఛామి"

● జ్యోతి మాసపత్రిక ●